ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





# జగిత్యాల
జిల్లా వార్తలు

5★★

మంగళవారం 22 జూలై 2025



నిర్మల్-జగిత్యాల రోడ్డు విస్తరణకు మోక్షం 6
● రెండో దశ నిర్మాణానికి ఆమోదం

కరుగుతున్న గుట్టలు 8
● చోద్యం చూస్తున్న అధికారులు


## సీజనల్ వ్యాధులపై ముందస్తు చర్యలు

-వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మంత్రి అడ్లూరి, కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన హైదరాబాద్ నుంచి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి, వాకాటి శ్రీహరి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డిలతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా సీఎం మాట్లాడుతూ వానాకాలం పంటల సాగు, సీజనల్ వ్యాధులపై అప్రమత్తత, రేషన్ కార్డుల పంపిణీ పురోగతి తదితర అంశాలపై అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా నుంచి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్, అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత, ఆర్డీఓ మధుసుదన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు ఆక్రమణకు గురి కాకుండా చూడాలి

-జగిత్యాల ఎమ్మెల్యేకు వినాయక నగర్ వాసుల వినతి

జగిత్యాల అర్బన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని వినాయక నగర్ కాలనీ రోడ్డుకు ఇరువైపుల మురికి కాలువ నిర్మించి రోడ్డు ఆక్రమణకు గురి కాకుండా చర్యలు చేపట్టాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌కు వినాయక నగర్ కాలనీ వాసులు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో ఇటీవల ఇళ్లు నిర్మించుకునే వారు రోడ్డు ఆక్రమించుకుని నిర్మాణాలు చేస్తున్నారని అన్నారు. సెట్ బ్యాక్ లేకుండా భవనాలు నిర్మిస్తుండడంతో రోడ్డు ఇరుకుగా మారుతోందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. నిబంధనల మేరకు నిర్మాణం జరిగేలా చూడాలని ఎమ్మెల్యేకు ఇచ్చిన వినతిపత్రంలో వారు పేర్కొన్నారు. ఎనుగంటి జనార్దన్, బి. సత్యం, ఎస్. వెంకట రమణ, సురేష్ ఎల్లయ్య లక్ష్మణ్ తదితరులు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.

# ఖరారు కాని నీటి విడుదల షెడ్యూల్

● ఎస్సారెస్పీలోకి భారీగా వరద రాకపోవడమే కారణం
● కనీసం 50 టీఎంసీలు నిల్వ ఉంటేనే విడుదల
● ప్రస్తుతం శ్రీరాంసాగర్‌లో 21.029 టీఎంసీల నీరు
● ఆగస్టు, సెప్టెంబరు వర్షాలపైనే ఆశలు



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

జగిత్యాల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు నీటి విడుదల ప్రణాళిక ఇంకా ఖరారు కాలేదు. జూలై మూడో వారంనాటికి అనుకున్నంత వరద నీరు రాకపోవడంతో ప్రాజెక్టు అధికారులు నీటి విడుదల ప్రణాళికపై దృష్టి సారించలేదు. డ్యామ్‌లో ప్రస్తుతం 21.029 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. కనీసం 50 టీఎంసీలు నిల్వ ఉంటేనే ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు నీటి విడుదల చేపట్టే అవకాశం ఉంటుందని అధికారులు అంటున్నారు. కానీ ఇప్పట్లో ప్రాజెక్టులోకి భారీ వరదలు వచ్చేలా కనిపించడం లేదు. ప్రాజెక్టు ఎగువన మహారాష్ట్రలో వర్షాలు లేకపోవడంతో ప్రాజెక్టులోకి భారీ వరదలు రావడం లేదు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర సాగునీటి, సమీకృత, నీటి నిర్వహణ, ప్రణాళిక, స్టాడింగ్ కమిటీ (సివమ్) సమావేశంలోనూ ఎస్సారెస్పీ ప్రాజెక్టు నుంచి నీటి విడుదలపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ప్రస్తుతం ప్రాజెక్టులో ఆశించినస్థాయిలో నీరు లేకపోవడం వల్ల మరోమారు సమావేశమై నీటి విడుదలపై పరిశీలన జరపాలని నిర్ణయించారు. దీంతో ఆయకట్టు రైతులు సాగుపై సందిగ్ధంలో పడిపోతున్నారు. రానున్న ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో కురిసే వర్షాలపైనే రైతులు ఆశలు పెంచుకుంటున్నారు.

### ● సీజన్‌లో ప్రాజెక్టులోకి 11.021 టీఎంసీల నీరు..

ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో ఎగువ ప్రాంతం నుంచి ఎస్సారెస్పీలోకి 11.021 టీఎంసీల నీరువచ్చి చేరింది. ఈ యేడాది జూన్1వ తేదీ నుంచి ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో నీరు చేరకపోవడంతో అధికారులు నీటి విడుదల ప్రణాళికపై దృష్టి సారించడం లేదు. బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తిన రెండు, మూడురోజుల పాటు నీరుకొంత ఎక్కువగా వచ్చినప్పటికీ, ఎగువ ప్రాంతంలో సైతం వర్షాలు లేకపోవడంతో కొన్ని రోజులుగా వెయ్యి క్యూసెక్కులలోపు మాత్రమే వరద నీరు వస్తోంది. దీంతో వరద నీరుపై ఆయకట్టు రైతుల్లో ఆశలు సన్నగిల్లుతున్నాయి. ప్రస్తుతం ప్రాజెక్టులోకి నీరు తగ్గుతూ, పెరుగుతూ వస్తోంది. ఎగువ ప్రాంతాల్లో కూడా వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఇన్‌ఫ్లో పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం సైతం పొంచి ఉంది.

### ● నిలకడగా నీటి మట్టం...

ప్రాజెక్టు నీటి మట్టం ప్రస్తుతం నిలకడగా ఉంది. డ్యామ్‌లోకి 608 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వాటర్ వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 21.029 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 18.833 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ అవసరాలకు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 608 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఇదిలా ఉండగా జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు ప్రాజెక్టులోకి 11.021 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నుంచి వివిధ అవసరాల నిమిత్తం 2.780 టీఎంసీల నీటిని వ్యయం చేశారు.

### ● ఎగువన ఖాళీనే..

ఎస్సారెస్పీలోకి ప్రధానంగా వరద వచ్చే మహారాష్ట్ర ప్రాంతంలోని గైక్వాడ్, విష్ణుపురి ప్రాజెక్టులు కూడా ఖాళీగా ఉన్నాయని ప్రాజెక్టు అధికారులు అంటున్నారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లో కూడా ప్రస్తుతం వర్షపాతం లేదని, ఇప్పటికిప్పుడు వరదలు వచ్చే అవకాశం లేదన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. 2018 సంవత్సరం నుంచి ప్రాజెక్టులోకి ప్రతీ యేడాది జూలై చివరి నాటికి వరద నీరు చేరగా ఈ యేడాది ఆ పరిస్థితి కనిపించడం లేదు.

### ● ఎస్సారెస్పీ నీటి పైనే అన్నదాతల ఆశలు

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 50 టీఎంసీల నీరు చేరితే వానాకాలం సీజన్‌కు ఆయట్టు ప్రాంతానికి నీటి విడుదల చేయాలని ఇటీవల అధికారులు నిర్ణయించారు. వర్షాలు భారీగా పడి వరదలు వచ్చే పరిస్థితులను బట్టి ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువలు, ఎత్తిపోతల పథకాల కింద సాగయ్యే పంటలకు నీటి విడుదల చేసేందుకు దృష్టి సారించే అవకాశం ఉంది. ఆయకట్టుకు నీటి అవసరానికి అనుగుణంగా ఆన్ ఆఫ్ పద్ధతిలో...


- మిగతా 8లో


# ధర్మపురి క్షేత్రం అభివృద్ధికి కృషి

● రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రాభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎండోమెంట్, ఇంజనీ రింగ్ అధికారులు, స్థపతి, ఆర్కిటెక్ట్‌లతో సోమవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయానికి దర్శనం కోసం వచ్చే భక్తుల కోసం మెరుగైన సౌకర్యాలు కల్పించా లన్నారు. ఉగ్ర నరసింహ స్వామి ఆలయ పునర్ నిర్మాణం గురించి ఇంజనీరింగ్ అధికారులు, స్థపతి సూచించిన ప్రకారం పునర్ నిర్మాణం చేస్తామని ఆయన అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వ పరంగా ఎలాంటి కాలయాపన లేకుండా పరిపాలన పరమైన అనుమతులతో పాటు నిధుల కొరత లేకుండా చూస్తానని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో ధర్మపురి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, దేవాదాయ శాఖ స్థపతి వల్లి నాగయం, సూపరింటెండెంట్ ఇంజనీరు ఓంప్రకాష్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

### సీఎంఆర్‌ఎఫ్ పేదల పాలిట వరం

పెగడపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజల పాలిట వరం లాంటిదని ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, వికలాంగుల శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం పెగడపల్లి మండల పరిషత్ కార్యాలయంలో మండలం లోని 41 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. 11 లక్షల 9 వేల రూపాయలు విలువ గల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో అనారోగ్యంతో, పలు ప్రమాదాల బారిన పడి ఆస్పత్రుల పాలైన పేద ప్రజలందరికి మెరుగైన వైద్య చికిత్స అందించేందుకుగాను ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా కోట్లాది రూపాయలు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మండలంలోని మద్దులపల్లిలో ఇటీవల మృతి చెందిన పురుషోత్తం గంగవ్వ కుటుంబ సభ్యులను మంత్రి లక్ష్మణ్ కుమార్ పరామర్శించారు. ఈకార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ బుర్ర రాములు గౌడ్, నందగిరి సింగిల్‌విండో చైర్మన్ కర్ర భాస్కర్ రెడ్డి, తహసీల్దార్ బి.రవీందర్, గిర్దావర్ శ్రీనివాస్, నాయకులు ఒరుగల శ్రీనివాస్, కడారి తిరుపతి, సంధి మల్లారెడ్డి, ఎలగొండ కృష్ణహరి, పూసాల తిరుపతి, శోభారాణి, స్వామి, అంజయ్య, కొమురయ్య, శ్యాంసుందర్‌రెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# అందరూ మొక్కలు నాటి సంరక్షించాలి

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మొక్కకు నీరు పోస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం కథలాపూర్ మండలంలోని అంబారిపేట గ్రామంలోని శ్రీ ఓంకారేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో అధికారులు నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. స్థానిక నాయకులు, అధికారులతో కలిసి మొక్కలను నాటి పరిరక్షణకు ట్రీగార్డులను ఏర్పాటు చేశారు. కథలాపూర్ మండలంలోని ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరు అయిన రూ. 14.35లక్షల విలువగల చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కృషి చేస్తుందని అన్నారు. రైతు భరోసా కింద తొమ్మిది రోజుల్లో 9 వేల కోట్ల రూపాయలను జమ చేసిందని అన్నారు. త్వరలో ఉమ్మడి మేడిపల్లి, కథలాపూర్ మండల ప్రజల చిరకాల వాంఛ కలికోట సూరమ్మ చెరువు రిజర్వాయర్ నిర్మాణం పూర్తి అవుతుందని అన్నారు. ఇప్పటికే రూ.6 కోట్ల నిధులతో పనులు జరుగుతున్నాయన్నారు. కుడి, ఎడమ కాలువలకు భూ సేకరణ జరిపి కాలువల నిర్మాణం చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మెన్ పూంద్ర నారాయణ రెడ్డి, పీసీసీ కార్యవర్గ తోట్ల అంజయ్య, మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం నాయకులు జువ్వాజీ రవీ, బైరిదేవ్ పాల్గొన్నారు.

## అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల అగ్రికల్చర్, జూలై 21(ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని స్థానిక ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ సబ్జెక్టులు బోధించుటకు అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అరిగెల అశోక్ తెలిపారు. కామర్స్-1, కంప్యూటర్ సైన్స్-1, ఇంగ్లీషు-2, చరిత్ర-1, గణితశాస్త్రం-1, భౌతికశాస్త్రం-1, రాజనీతి శాస్త్రం-1, తెలుగు-2 బోధించుటకు అతిథి అధ్యాపకులు అవసరమని పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులలో పీజీలో 55శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీలు 50శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ కలిగిన అభ్యర్థులకు మరియు బోధన అనుభవం గల వారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. అర్హులైన అభ్యర్థులు జూలై 22నుంచి 24 వరకు కళాశాల పనిదినాల్లో తమ దరఖాస్తులను కళాశాలలో అందించాలన్నారు. జూలై 25వ తేదీన ఉదయం 9గంటలకు ఎస్‌కేఎన్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరుకావాలన్నారు. వివరాలకు అకడమిక్ కో ఆర్డినేటర్ సాయిమధుకర్ సెల్ నం.8121513671, సురేందర్ సెల్‌నం. 9182629753లో సంప్రదించాలని పేర్కొన్నారు.

## ఘనంగా గోరింటాకు వేడుకలు

కోరుట్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంజనేయ స్వామి దేవాలయంలో ఆషాఢమాసం పురస్కరించుకొని మహిళలు గోరింటకు వేడుకలను నిర్వహించారు. అనంతరం దేవాలయంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.

# ‘బీసీలకు 50శాతం రిజర్వేషన్ కల్పించాలి’



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బీసీ సంక్షేమసంఘం నాయకులు

జగిత్యాల అర్బన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని చేపట్టిన చలో ఢిల్లీ వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ బీసీలకు పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో 50శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఓబీసీ జాతీయ స్థాయి సదస్సులు నిర్వహిస్తు న్నామని తెలిపారు. ఈ సదస్సులకు తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక, ఒరిస్సా రాష్ట్రాల నుంచి బీసీలు పాల్గొంటారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లకు కట్టుబడి ఉండాలన్నారు. కార్యక్రమంలో బిసీ సంక్షేమ సంఘం నాయకులు గంగాధర్, అనుమల్ల సంజయ్ స్వామి, మల్లీశ్వరి, వంశీ పాల్గొన్నారు.

## సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

మల్యాల, జూలై21 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కేటాయించడం పట్ల మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్లు తీసుకురావడం చరిత్రాత్మకమయని ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆదిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, రాంలింగారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, తిరుపతి, వినయ్, శ్రీకాంత్, లక్ష్మన్, ప్రతాప్, మల్లేశం, వెంకన్న పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన

జగిత్యాలరూరల్. జూలై 16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల అర్బన్ మండలం మోతె గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లకు అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ఇందిరమ్మ కమిటీ సభ్యుల సమక్షంలో ఇండ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈకార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు రాజేశ్వర్‌రెడ్డి, గంగాధర్, కార్యదర్శి కృష్ణచైతన్య, శేఖర్‌రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

మెట్‌పల్లి రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అన్ని రంగాలు అభివృద్ధి చెందుతున్నాయని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని వేంపేట గ్రామంలో అంగన్‌వాడీ కేంద్ర భవనం నిర్మాణానికి పంచాయతీ కార్యదర్శి అశోక్ స్థానిక నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. కార్యక్ర మంలో మెట్‌పల్లి ఏఎంసీ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఇందిరమ్మ కమిటీ నాయకులు సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తా

● ఎమ్మెల్సీ ఎల్.రమణ



ఎస్‌కేఎన్‌ఆర్ తొలి ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ రమణ

జగిత్యాల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): శ్రీ కాసుగంటి నారాయణరావు డిగ్రీ కళాశాల(ఎస్‌కేఎన్‌ఆర్) అభివృద్ధికి తన వంతు వృషి చేస్తానని కళాశాల పూర్వ విద్యార్థి, ఎమ్మెల్సీ ఎల్. రమణ అన్నారు. సోమవారం కళాశాల తొలి ప్రిన్సిపాల్ కొండల్‌రావు 94వ జన్మదినం సందర్భంగా హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కళాశాల పూర్వ విద్యార్థులు ఎమ్మెల్సీ ఎల్. రమణ, మాజీ మంత్రులు రాజేశం గౌడ్, సుద్దాల దేవయ్య, కళాశాల పూర్వ వైస్ చాన్సలర్ వీరారెడ్డి, కళాశాల భూదాత ఎస్‌కేఎన్‌ఆర్ మనవడు ప్రముఖ న్యాయవాది కాసుగంటి లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ కళాశాలను యూని వర్సిటీగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. శ్రీ కాసుగంటి నారాయణ రావు విగ్రహాన్ని కళాశాల ముందు ఏర్పాటు చేస్తామ న్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల పూర్వ విద్యార్థులు, ప్రస్తుత కళాశాల ప్రిన్సిపల్ అరిగెల అశోక్, ఎస్పీ సుబ్రహ్మణ్యం, వి. ప్రభాకర్‌రావు, సిరిసిల్ల శ్రీనివాస్‌పాల్గొన్నారు.

# వర్షాలు కురవాలని కప్పతల్లి ఆటలు



కోనరావుపేటలో కప్పతల్లి ఆటలాడుతున్న గ్రామస్థులు

మెట్‌పల్లి రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు సమృద్ధిగా కురవాలని మండలంలోని కోనరావుపేట గ్రామంలో సోమవారం కప్పతల్లి ఆటలాడి ఆలయాల్లోని ఉత్సవమూర్తులకు జలాభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి కమిటీ నాయకులు మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు కావస్తున్న ఆశించిన స్థాయిలో వానాలు కురవక పోవడంతో మొక్కజొన్న, వేసిన విత్తనాలు ఎండిపోతున్నాయని, నారు మళ్లు ముదిరి పోతున్నాయన్నారు. దీంతో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వ ర్యంలో వరుణదేవుడికి పూజలు చేసి కప్పతల్లి ఆటలాడడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## ‘హత్య కేసు నిందితులను కఠినంగా శిక్షించాలి’

వెల్గటూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కిషన్‌రావుపేటకు చెందిన దళిత యువకుడు మల్లేష్‌ను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. వెల్గటూర్ మండలం కిషన్ రావుపేట గ్రామంలో మల్లేష్ కుటుంబాన్ని సోమవారం దళిత సంఘాల నిజ బృందం నాయకులు పి. శంకర్, మర్వాడి సుదర్శన్, హైకోర్టు న్యాయవాది ఎద్దు దివాకర్, న్యాయ శాస్త్ర విద్యార్థి శివకుమార్‌లు పరామర్శించి హత్య వివరాలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ మల్లేష్ హత్య కేసును నీరు కార్చేందుకు పోలీసులు బలహీనమైన ఫిర్యాదును రాయించారని ఆరోపించారు. హత్య జరిగి ఐదు రోజులు గడిచినా డీఎస్పీ బాధితుల నుంచి 151 స్టేట్‌మెంట్ రికార్డు చేయలేదని మండిపడ్డారు. పోలీసులు యువకుడి హత్య కేసును తప్పుదోవ పట్టిస్తూ సాధారణ హత్యగా చూడటం తగదన్నారు. ఈ కార్యక్రమంలో దళిత లిబరేషన్ ఫ్రంట్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ పాల్గొన్నారు.

## విద్యుత్ అధికారుల ‘పొలం బాట’

జగిత్యాలరూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల రూరల్ మండలం హైదరపల్లి గ్రామంలో విద్యుత్ అధికారులు, రైతులతో కలిసి పొలంబాట నిర్వహించారు. ఈసందర్భంగా విద్యుత్ ఏఈ సుందర్ మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో సబ్ ఇంజనీర్ రంజిత్, లైన్ ఇన్‌స్పెక్టర్ రవిశంకర్‌రావు, రైతులు చిత్తారి ప్రభాకర్, శేఖర్, నర్సయ్య, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

## గేదె పొడిచి ఒకరి మృతి

వేములవాడ రూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిపై గేదె దాడి చేయడంతో తీవ్ర గాయలపాలై మృతిచెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాంపల్లి గ్రామానికి చెందిన కర్ర అనంతరెడ్డి (65) ఆదివారం రాత్రి పనులు ముగించుకుని తన ఇంటికి చేరుకున్నాడు. గేదె మెడకు తాడు కట్టే సమయంలో ఒక్కసారిగా కొమ్ములతో పొడవడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక వైద్యులను సంప్రదించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అనంతరెడ్డి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు.

## గీత కార్మికుడి ఆత్మహత్య

ఓదెల, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఐలు శ్రీనివాస్ గౌడ్(48) అనే గీత కార్మికుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రీనివాస్ గౌడ్ కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందినా నయం కాలేదు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగగా కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి కుమారుడు రవితేజ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ కిషన్ తెలిపారు.

## యువకుడి ఆత్మహత్య

మల్యాల, జూలై 21(ఆంధ్రజ్యోతి): నూకపల్లి అర్బన్ హౌసింగ్ కాలనీకి చెందిన మహ్మద్ షబ్బీర్(19)అనే యువకుడు సోమవారం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. పనిదొరకకపోవడంతో మనోవేదనతో ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు.



# పదో తరగతిలో ఏఐ పాఠాలు

- మద్రాస్ ఐఐటీ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ శిక్షణ
- ఎన్‌రోల్‌మెంట్‌కు ఈ నెల 25 వరకు గడువు
- ఏడాదిలో మూడు బ్యాచ్‌లకు అవకాశం

హుజూరాబాద్‌రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఐఐటీలు అందించే వివిధ కోర్సులపై స్కూల్ దశ నుంచే అవగాహన కల్పించాలని మద్రాస్ ఐఐటీ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కొత్త అంశాలు నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఏఐతో పాటు ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్స్, డాటా సైన్స్ లాంటి కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నది. 2025-26 విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇచ్చేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ విద్యా సంవత్సరంలో మూడు బ్యాచ్‌లకు ఐఐటీలో శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రకటిం చింది.

మొదటి బ్యాచ్ విద్యార్థులకు ఆన్‌లైన్‌లో ఎన్‌రోల్‌మెంట్ చేసుకునేందుకు ఈ నెల 25వ తేదీ చివరి తేదీగా నిర్ణయించారు. ఆగస్టు మొదటి వారంలో తరగతులు ప్రారంభం కానున్నాయి. స్కూల్ కనెక్ట్ పేరుతో ఈ ఏడాది నుంచి ఆన్‌లైన్‌లో 10 కోర్సులకు శిక్షణ ఇచ్చేందుకు మద్రాస్ విద్యాలయం ఏర్పాట్లు చేసింది. హుజూరాబాద్ మండలంలోని 13 ఉన్నత పాఠశాలలతో పాటు గురుకుల పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో శిక్షణ ఇవ్వనున్నారు.

### ● కోర్సులు ఇవే

డాటా సైన్స్, ఏఐ, ఎలక్ట్రానిక్స్ సిస్టమ్, ఆర్కిటెక్చర్ అండ్ డిజైన్, పన్‌విత్ మ్యాథ్స్ అండ్ కంప్యూటింగ్, మ్యాథ్స్ అన్‌ప్లగ్‌డ్ గేమ్స్ అండ్ పజిల్స్, పర్యావరణం, ఇంజనీరింగ్ బయోలాజికల్ సిస్టమ్, లా, ఏరోస్పేస్ (ప్రాథమిక అంశాలు), హ్యూమానిటీస్ తదితర కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనున్నారు.

### చాలా మంచి అవకాశం..

**చరణ్, పదో తరగతి, చెల్పూర్**



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆన్‌లైన్‌లో ఐఐటీ శిక్షణ ఇవ్వటం చాలా మంచి అవకాశం. నేను కూడా నేర్చుకోవాలనుకుంటున్నాను. బయట రూ. వేలల్లో ఫీజులు వెచ్చించి ప్రైవేట్ కోచింగ్ తీసుకోలేము. ఇది మాకు చక్కటి అవకాశం. ఈ కోర్సులపై శిక్షణ అందితే భవిష్యత్తులో ఇంకా ఎంతో నేర్చుకోవచ్చు.

### ఐఐటికి మార్గం సుగమం

**పవన్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, చెల్పూర్**



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఐఐటి మద్రాస్ ఆన్‌లైన్ కోచింగ్ ఇవ్వడం వల్ల భవిష్యత్తులో ఐఐటిలో సీటు సంపాదించేందుకు మార్గం సుగమం అవుతుంది. ఈ విషయంపై మేము విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. బయట దాదాపు మూడేళ్ల కోచింగ్ తీసుకోవడంతో ఇంటర్ తర్వాత విద్యార్థులు ఐఐటి సీట్లు సాధించే అవకాశం ఉంటుంది.

### ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గొప్ప అవకాశం

**: భూపతి శ్రీనివాస్, ఎంఈవో, హుజూరాబాద్**



ఐఐటీలో పదో తరగతి విద్యార్థులకు ఆన్‌లైన్ కోర్సుకు సంబంధించి శిక్షణ ఇస్తున్న విషయంపై పిల్లలకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలి. హైస్కూల్ దశలోనే ఐఐటీ స్థాయిలో ప్రాథమిక అంశాలు నేర్చుకోవడం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గొప్ప అవకాశం. శిక్షణ తీసుకున్న విద్యార్థులు భవి ష్యత్తులో గొప్పగా రాణించే అవకాశం ఉంటుంది. విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో ఎన్‌రోల్ చేయాలని ఉపాధ్యాయులకు సూచిస్తున్నాం.



## పిడుగు పడి 30 గొర్రెలు మృతి

- కాపరికి తప్పిన ప్రాణాపాయం



మృతి చెందిన గొర్రెల వద్ద బాధిత కుటుంబీకులు

మంథనిరూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిపురం గ్రామ పంచాయతీ పరిధిలోని గోదావరి ఒడ్డున సోమవారం సాయంత్రం గొర్రెల మందపై పిడుగు పడటంతో 30 గొర్రెలు మృతి చెందగా గొర్రెల కాపరికి ప్రాణాపాయం తప్పింది. చిల్లపల్లి గ్రామానికి చెందిన గొర్రెల కాపరి పుట్ట పోచయ్య గొర్రెలను మేపడానికి గోదావరి వద్దకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి తిరిగి వస్తుండగా ఒక్కసారిగా మబ్బులు కమ్ముకొని వర్షం పడింది. అకస్మాత్తుగా గొర్రెల మందపై పిడుగు పడటంతో 30 గొర్రెలు అక్కడిక్కడే మృతి చెందాయి. వాటికి దగ్గరలో ఉన్న పోచయ్య పిడుగుపాటుకు స్పృహతప్పి కిందపడ్డాడు. సమీపంలో ఉన్న మరో గొర్రెల కాపరి గోపు గంగయ్య కుటుంబ సభ్యులకు, గ్రామస్థులకు సమాచారం అందించాడు. అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు పోచయ్యను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. చనిపోయిన గొర్రెల విలువ రూ.3 లక్షల వరకు ఉంటుందని, ప్రభుత్వం బాధితుడికి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

## బాకీ డబ్బులు అడిగినందుకు దాడి.. కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, జూలై 21(ఆంధ్రజ్యోతి): తన బాకీ డబ్బులు తీర్చాలన్నందుకు దాడి చేసి చంపుతానని బెదిరించిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి గోగూరి ప్రదీప్‌రెడ్డిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి సోమవారం తెలిపారు. గ్రామంలోని ప్రదీప్‌రెడ్డి తన వ్యవసాయ పొలం వద్ద బోరు వేయించుకుంటాని అదే గ్రామ వాసి పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి వద్ద రూ.70 వేలు తీసుకున్నాడు. తీసుకున్న అప్పు తీర్చాలని ఈ నెల 20న అడిగితే కోపోద్రిక్తుడైన ప్రదీప్‌రెడ్డి అసభ్యపదజాలంతో దూషించడంతో పాటు దాడి చేసి చంపుతానని శ్రీనివాస్‌రెడ్డిని బెదిరించాడని ఎస్సై పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ప్రదీప్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

## జీవితంపై విరక్తి చెంది ఒకరి ఆత్మహత్య

జగిత్యాలరూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామానికి చెంది న ఇనుగుర్తి కాంతం (45) అనే వ్యక్తి సోమవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలి పారు. ఒంటరితనంతో బాధపడుతున్న కాంతం తాగుడుకు బానిసయ్యాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

## నూకపల్లి అర్బన్ కాలనీలోకి నీరు





అర్బన్‌కాలనీలో వర్షపు నీరు, ఇంటిలోకి వచ్చిన నీరు

జగిత్యాల అర్బన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని నూకపల్లి అర్బన్ కాలనీలోని డబుల్ బెడ్ రూం ఇళ్లలో చిన్న పాటి వర్షానికే ఇళ్లలోకి నీరు వచ్చి కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం కురిసిన వర్షానికి ఇళ్లలోకి నీరు చేరి వస్తువులన్నీ తడిసి పోయాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో మురికి కాలువలు పూర్తి స్థాయిలో నిర్మాణం కాక పోవడం వల్ల మురికి కాలువ నీరు ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయని పేరొన్నారు. ప్రధాన రహదారి చిన్న పాటి వర్షానికే బురదమయం అవుతుండగా అంతర్గత రహదారులు సైతం వర్షానికి నీటితో నిండిపోవడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. రోడ్ నంబర్ 7,8లో చిన్న వర్షానికే నీరు చేరుతుందని కాలనీ వాసులు పేర్కొంటున్నారు.

# మూతపడిన 'సహారోగ్య'

- బ్యాంకులో రూ.10.70 కోట్ల రుణం
- షాపుల కిరాయి, సిబ్బంది జీతాలు ఎగవేత

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

సహారోగ్య మెడికల్ షాపులు మూతబడ్డాయి. రెండేళ్ల క్రితం పలు జిల్లాల్లో అట్టహాసంగా ప్రారంభమైన బ్రాంచ్‌లను క్రమంగా మూసివేసింది. సహారోగ్య హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో పెద్దపల్లిలోని ఒక బ్యాంకులో రూ.10.70 కోట్లు రుణం తీసుకొని పలు జిల్లాల్లో మెడికల్ షాపులను ప్రారంభించింది. కొద్ది రోజులపాటు వాటిని నిర్వహించి ఆ తర్వాత మూసేసింది. బ్యాంకు రుణాలకు సంబంధించిన నెలనెలా కిస్తు చెల్లించకపోవడంతో బ్యాంకు అధికారులు లీగల్ నోటీసులు జారీ చేశారు. మెడికల్ షాపులకు షెటర్‌లను అద్దెకు ఇచ్చిన యజమానులు కిరాయి డబ్బులు చెల్లించకపోవడం, ఖాళీ చేయకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా విషయం వెలుగులోకి వచ్చింది.

సహారోగ్య హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వ్యవస్థాపకులు, సీఈఓ హైదరాబాద్‌కు చెందిన కరణం నాగేంద్ర ప్రసాద్, చీకురాయికి చెందిన జక్కుల అశోక్ కుమార్ సహారోగ్య పేరిట పెద్దపల్లి మండలం చీకురాయికి చెందిన జక్కుల తిరుపతి, పెద్దపల్లి పట్టణానికి చెందిన కొమిరిశెట్టి కనుకయ్య, నారాయణ స్వామి సురేష్ పేరిట గల భూములను పెద్దపల్లిలోని ఎస్‌బీఐ (ఏడీబీ) బ్యాంకు పేరిట మార్ట్ గేజ్ చేశారు. 2022 మే 31న 4 కోట్ల 50 లక్షలు, 2023, అక్టోబర్ 7వ తేదీన 6 కోట్ల 20 లక్షల రూపాయలు రుణంగా తీసుకున్నారు. పెద్దపల్లి, సుల్తానాబాద్, గోదావరిఖని, జమ్మికుంట, హుజూరాబాద్, కరీంనగర్, జగిత్యాల, భూపాలపల్లి, జనగాం, హన్మకొండ, కామారెడ్డి, నిర్మల్, సిద్దిపేట, రామాయంపేట తదితర ప్రాంతాల్లో భవనాలను అద్దెకు తీసుకుని సహారోగ్య పేరిట మెడికల్ షాపులను తెరిచారు. ఈ షాపుల్లో ఫార్మసిస్టులు, సిబ్బందిని నియమించి కొద్ది రోజులపాటు నడిపించి అనంతరం మూసివేశారు. సహారోగ్య మెడికల్ షాపులను మూసివేశారని తమకు రావాల్సిన అద్దె డబ్బులు లక్షా 80 వేల రూపాయలు ఇప్పించాలని ఈ ఏడాది మార్చి 19న పోలీసులకు, అదే నెల 24వ తేదీన ప్రజావాణిలో కలెక్టర్‌కు షాపు యజమాని సహేత భాను, ఎండీ రహీముద్దీన్ ఫిర్యాదు చేశారు. అద్దె బకాయిలు చెల్లించకపోయినా కొందరు షట్టర్లను ఖాళీ చేయించారు. మరి కొందరు వాటిని ఖాళీ చేయాలని కోరుతున్నా నిర్వాహకులు పట్టించుకోవడం లేదని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పెద్దపల్లి ఎస్‌బీఐ (ఏడీబీ) బ్యాంకులో తీసుకున్న రుణానికి సంబంధించి కిస్తీలు కోటి రూపాయల లోపు చెల్లించినట్లు సమాచారం. ఆ తర్వాత కిస్తీలు చెల్లించకపోవడంతో బ్యాంకు అధికారులు సహారోగ్య సీఈఓ నాగేంద్ర ప్రసాద్, జక్కుల అశోక్‌కుమార్, కొమిరిశెట్టి కనుకయ్య, నారాయణ స్వామి సురేష్ కుమార్, జక్కుల తిరుపతి, సెట్టిపల్లి సుబ్బరామయ్యకు బ్యాంకు అధికారులు లీగల్ నోటీసులు పంపించారు. అయితే బ్యాంకు రుణాల కోసం మార్ట్‌గేజ్ చేసిన కొమిరిశెట్టి కనుకయ్య, నారాయస్వామి, సురేష్‌కుమార్‌ల పేరిట పట్టణంలో 290 సర్వే నంబర్‌లో గల 20 గుంటల భూమి కోర్టు వివాదంలో ఉంది. ఆ భూమిని చూపి నిర్వాహకులు రుణాలు తీసుకున్నారు. సహారోగ్య పేరిట మెడికల్ షాపులను తెరిచి వాటిని మూసి వేసి అద్దె డబ్బులు ఇవ్వకుండా తమను ఇబ్బందులకు గురి చేస్తున్న నాగేంద్రప్రసాద్, అశోక్ కుమార్‌లపై చర్యలు తీసుకోవాలని అద్దె భవనాల యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.




పెద్దపల్లిలో మూసిఉన్న మెడికల్ షాప్

## 24 నుంచి పెద్దపల్లి రైల్వే బైపాస్ మార్గం ఇంటర్ లాకింగ్ పనులు

- పలు రైళ్లు రద్దు

పెద్దపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి రైల్వే జంక్షన్ సమీపంలో నిర్మిస్తున్న బైపాస్ రైలు మార్గాన్ని అందుబాటులోకి తీసుక వచ్చేందుకు ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు ఇంటర్ లాకింగ్, నాన్ ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా కాజీపేట-బల్లార్షా లైన్‌లో కొన్ని రైళ్లు పూర్తిగా, కొన్ని రైళ్లను పాక్షికంగా రద్దు చేశారు. కరీంనగర్ నుంచి సిర్‌పూర్‌కు నడిచే మెమూ ఎక్స్‌ప్రెస్, రామగిరి మెమూ ఎక్స్‌ప్రెస్ రైళ్లను 25, 26, 27 తేదీల్లో రద్దు చేశారు. కాజీపేట నుంచి బల్లార్షా వరకు నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు 24 నుంచి 26 వరకు బల్లార్షా ఎగువ మార్గంలో, 25 నుంచి 27 వరకు దిగువ మార్గంలో కాజీపేట వైపు రద్దు చేశారు. సికింద్రాబాద్ నుంచి సిర్‌పూర్ వరకు నడిచే సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు 25 నుంచి 27 వరకు పూర్తిగా రద్దు చేశారు. హైదరాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ వరకు కాగజ్‌నగర్ నుంచి బీదర్ వరకు నడిచే ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు 25 నుంచి 27 వరకు, భద్రాచలం రోడ్ నుంచి బల్లార్షా, సిర్‌పూర్ నుంచి భద్రాచలం వరనకు నడిచే సింగరేణి ఎక్స్‌ప్రెస్‌ను 25 నుంచి 27 వరకు రద్దు చేశారు. ఈ నెల 24న కొత్త ఢిల్లీ నుంచి నాంపల్లి హైదరాబాద్ వెళ్లే తెలంగాణ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు దక్షిణ మధ్య జోన్ పరిధిలో ఒక గంట 15 నిమిషాల పాటు నియంత్రణ చేశారు. నిజాముద్దీన్ ఢిల్లీ కేఎస్‌ఆర్ బెంగుళూర్ సిటీ మధ్య నడుస్తున్న రాజధాని సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలును దక్షిణ మధ్య రైలు జోన్ పరిధిలో 20 నిమిషాలు, చెన్నై సెంట్రల్ నుంచి కొత్త ఢిల్లీ, తమిళనాడు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలును దక్షిణ మధ్య జోన్ పరిధిలో గంట సేపు నియంత్రణ చేశారు. తిరుపతి నుంచి కరీంనగర్ వరకు నడిచే బై వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు 26న తిరుపతి నుంచి రాత్రి 8:05 గంటలకు బదులు రాత్రి 10:35 గంటలకు బయలుదేరనున్నదని దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు.

## శాశ్వత మరమ్మతులు పట్టవా?

- మూలవాగులో కొట్టుకుపోతున్న తాత్కాలిక రోడ్లు
- ప్రతి యేటా ఇబ్బందులు పడుతున్న ప్రజలు



మామిడిపల్లి - నిజామాబాద్ మూలవాగు వద్ద కొట్టుకపోయిన కాజ్ వేపై వాగు దాటడానికి ఇబ్బంది పడుతున్న ప్రజలు

కోనరావుపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మూలవాగులో కొట్టుకపోయిన కాజ్ వేల స్థానంలో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. తాత్కాలికంగా చేపట్టిన రోడ్లు మూలవాగు వరద తాకిడికి ప్రతి యేటా కొట్టుకుపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి, నిజామాబాద్, బావుసాయిపేట, వెంకట్రావుపేట, వట్టిమల్ల, నిమ్మపల్లి గ్రామాలను కలిపే రహదారులకు గత కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వం మూలవాగులో కాజ్ వేల నిర్మాణం చేపట్టగా గత ఆరు సంవత్సరాల క్రితం మూలవాగు ఉధృతికి కాజ్ వేలు కొట్టుకపోయాయి. వాటిపై అప్పటి నుంచి తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. తిరిగి వర్షాకాలం రాగానే మూలవాగులో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మట్టి రోడ్లు కొట్టుకుపోతున్నాయి. దీంతో వాగు దాటడానికి రైతులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గత కాంగ్రెస్ పాలనలో ప్రస్తుత ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రోత్సాహంతో అప్పటి ఆర్‌అండ్‌బి మంత్రి జీవన్‌రెడ్డి నిధులు కేటాయించగా కాజ్ వేలు చేపట్టారు. కాజ్ వేలు వరద తాకిడికి కొట్టుకపోవడంతో బీఆర్ఎస్ ప్రభుత్వం తాత్కాలిక మరమ్మతులు చేపట్టింది. కానీ శాశ్వత పరిష్కారం కోసం నిధులు మంజూరు చేసి పనులు చేపట్టకపోవడంతో తాత్కాలిక రోడ్లు ప్రతియేటా కొట్టుకుపోతున్నాయి. దీంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉండిపోయింది. మళ్లీ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందిస్తే తప్ప సమస్య పరిష్కారం కాదని మండలవాసులు కోరుతున్నారు.



వరద తాకిడికి కొట్టుకపోయిన మామిడిపల్లి-నిజామాబాద్ కాజ్ వే

# ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?

- డేంజర్ జోన్‌గా ఆరెపల్లి-నందికమాన్ రోడ్డు
- నాలుగు వరుసల రోడ్డు ఏర్పాటు చేయాలని డిమాండ్

వేములవాడ టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ నుంచి కరీంనగర్ వెళ్లే ప్రధాన రహదారిలో ఆరెపల్లి నుంచి నందికమాన్ వరకు డేంజర్ జోన్‌గా మారింది. వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయానికి నిత్యం వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. అయితే ఆరెపల్లి, సంకెపల్లి, రుద్రవరం, గొల్లపల్లి, అనుపురం, కొడుముంజ, శాభాష్‌పల్లి నాంపల్లి గ్రామాలు కలిసి ఉండటంతో తరచూ జన సంచారంతో రోడ్డు బీజీగా ఉంటుంది. దీంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. సంకెపల్లి గ్రామ సమీపంలో రోడ్డు మూలమలుపు ఉండటంతో కరీంనగర్ నుంచి వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో వాహనదారులు రోడ్డును దాటేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో స్థానికులు రోడ్డు ప్రమాదాలబారిన పడుతున్నారు.

### డేంజర్ జోన్‌గా ఆర్‌అండ్‌ఆర్ కాలనీలు

వేములవాడ మండలంలోని ఆరెపల్లి, సంకెపల్లి, గొల్లపల్లి, రుద్రవరం, అనుపురం, నాంపల్లి, శాభాష్ పల్లి, కొడుముంజ గ్రామాల్లోని ప్రధాన రోడ్డు డేంజర్ జోన్‌గా మారింది. రుద్రవరం గ్రామం సమీపంలో ఒకవైపు రుద్రవరం సంకెపల్లి గ్రామాలు ఉండగా మరోవైపు గొల్లపల్లి, సంకెపల్లి గ్రామాలు రోడ్డుకు ఇరువైపులా ఉన్నాయి. గొల్లపల్లి గ్రామానికి రావాలన్నా, రోడ్డు దాటాల్సివచ్చినా ప్రజలు జంకుతున్నారు. గొల్లపల్లి గ్రామానికి చెందిన రాములు అనే వ్యక్తి తన ద్విచక్రవాహనంపై గొల్లపల్లి వైపు రోడ్డు దాటేందుకు ప్రయత్నించగా అటుగా వస్తున్న ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టాడు. ఈ సంఘటనలో గొల్లపల్లికి చెందిన రాములుకు, సంకెపల్లికి చెందిన విజయ్ ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. అదే గ్రామానికి చెందిన తిరుపతి-స్వప్న దంపతులు రోడ్డు దాటే క్రమంలో ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో కిందపడి గాయాలతో ఆసుపత్రి పాలయ్యారు. ఇటీవల వేములవాడ మండలం శాభాష్‌పల్లి గ్రామానికి చెందిన మహిళ సంఘం సభ్యులు కొదురుపాక గ్రామంలోని బ్యాంకుకు వెళ్లేక్రమంలో సైకిల్‌పై వెళుతున్న బాలుడిని తప్పించబోయిన ఆటో బోల్తాపడింది. ఈ ఘటనల 9 మందికి తీవ్ర గాయాలయ్యాయి.



ప్రమాదకరంగా ఉన్న సంకెపల్లి మూలమలుపు

### తరచూ ప్రమాదాలు

వేములవాడ మండలం ఆరెపల్లి నుంచి నాంపల్లి నందికమాన్ వరకు రోడ్డు వెడల్పు లేకపోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని మార్చి 15వ తేదీన 'ఆంధ్రజ్యోతి' దిన పత్రికలో 'డేంజర్ జోన్‌గా మూడు గ్రామాల కూడలి' కథనం ప్రచురితమైంది. ఏప్రిల్ 15వ తేదీన అనుపురం గ్రామానికి చెందిన శ్రీహరి అనే వ్యక్తి తన ఇంటికి ద్విచక్రవాహనం మీద వెళ్లే క్రమంలో రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. జూన్ 18వ తేదీన కారు ప్రమాదంలో రుద్రవరం గ్రామ బస్టాప్ ముందు నడుచుకుంటూ రోడ్డు దాటుతున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కార్మికుడు, ఆరెపల్లిలో ద్విచక్ర వాహనంపై వేములవాడకు వస్తున్న పట్టణానికి చెందిన యువకుడు మృత్యువాత పడ్డాడు.

సంకెపల్లి, అనుపురం, నాంపల్లి గ్రామాల్లో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసు శాఖ ఆధ్వర్యంలో బారికేడ్స్‌ను ఏర్పాటు చేశారు. ఆరెపల్లి, సంకెపల్లి గ్రామాల్లో వాహనాల స్పీడ్ అదుపులోకి తీసుకురావడానికి స్పీడ్‌బ్రేకర్‌లు ఏర్పాటు చేయాలని, నాలుగు వరసల రోడ్డుతో పాటు కాలనీలో సర్వీస్ రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.

### నాలుగు వరుసల రోడ్డు నిర్మించాలి

**- ఎర్రం మహేష్, అనుపురం**



నిత్యం వేల మంది రాజన్న ఆలయానికి వస్తుంటారు. డబుల్ రోడ్డు కావడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. నాలుగు వరసల రోడ్డు నిర్మాణం చేపట్టి ప్రమాదాలకు చెక్‌పెట్టాలి.

### మిత్రుడిని కోల్పోయాం

**- మ్యాకల రవి, అనుపురం**



మా మిత్రుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం కలిచివేస్తోంది. నాలుగు వరుసల రోడ్డుతో పాటు, సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలి. రోడ్డు దాటాలంటే గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు.

# నిర్మల్-జగిత్యాల రోడ్డు విస్తరణకు మోక్షం

- రెండో దశ నిర్మాణానికి ఆమోదం

రాయికల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఏళ్లుగా ఎదురు చూస్తున్న నిర్మల్-జగిత్యాల జాతీయ రహదారి నిర్మాణానికి మోక్షం లభించింది. జాతీయ రహదారి-61 నిర్మాణ ఏర్పాటుకు 2018లో ప్రాథమిక సర్వే చేపట్టగా, 2020లో తొలి విడత నిర్మల్-ఖానాపూర్ రహదారికి నిధులు కేటాయించి పనులు ప్రారంభించారు. ఖానాపూర్ మండలం సుర్జాపూర్ వరకు పనులు పూర్తి కావస్తున్నాయి. రెండవ విడతలో జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండం ఒబులాపూర్ నుంచి రాయికల్ మీదుగా జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ వరకు పనులకు మోక్షం లభించింది. జాతీయ రహదారులు రవాణా మంత్రిత్వ శాఖ (ఎంవోఆర్‌టీహెచ్) ఆమోద ముద్ర వేసింది. నిర్మల్-జగిత్యాల జాతీయ రహదారి నిర్మాణంతో ఇరు జిల్లాల మధ్య మార్గం మరింత సుగమం కావడంతో పాటు మహారాష్ట్రతో పాటు పలు రాష్ట్రాలకు ప్రయాణం సులువు కానుంది.

### జిల్లాలో 39 కి.మీ.

మహారాష్ట్రలోని కళ్యాణ్ నుంచి ప్రారంభమయ్యే 61వ నెంబర్ జాతీయ రహదారి బైంసా మీదుగా నిర్మల్ వరకు నిర్మాణం జరిగింది. నిర్మల్, జగిత్యాల జిల్లాలో 74 కి.మీ. రహదారి నిర్మాణానికి ప్రతిపాదించారు. గతంలో ప్రాథమిక సర్వే పూర్తి చేశారు. తొలి విడతలో నిధులు మంజూరు కాగా, నిర్మల్ నుంచి ఖానాపూర్ మండలం బాదన్‌కుర్తి వరకు 35 కి.మీ. మేర రహదారి నిర్మాణం చివరి దశలో ఉంది. రెండవ విడత జగిత్యాల జిల్లాలోని మల్లాపూర్ మండలం ఒబులాపూర్ నుంచి చల్‌గల్ వరకు 39 కి.మీ. మేర పనులు చేపట్టాల్సి ఉంది.



రాయికల్-జగిత్యాల రహదారి

## పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

గన్నేరువరం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వారు సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకుంటే పోయిన ఫోన్‌ను గుర్తించవచ్చని ఎస్సై నరేందర్ రెడ్డి అన్నారు. మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామానికి చెందిన చావుల మధుకర్ ఇటీవల సెల్‌ఫోన్ పోగొట్టుకోగా పోలీసులకు సమాచారం అందించి సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేశారు. 24 గంటలలోనే సీఈఐఆర్ ద్వారా ఫోన్‌ను ట్రేస్ చేసి పట్టుకుని సోమవారం మధుకర్‌కు అందించారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వారు సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఎస్సై సూచించారు.

# కలువ పూల అందాలు చూడతరమా..!



## చూపరులను ఆకట్టుకుంటున్న నాంపల్లి చెరువు

వేములవాడ టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి గుడిబండ చెరువులో వికసించిన తామర పూలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. నిత్యం వేల సంఖ్యలో భక్తులు చెరువుకట్ట మీదుగా రాజన్న ఆలయానికి వస్తుంటారు. దీంతో భక్తులకు గుడి బండ చెరువులోని కమలం పువ్వులు కనువిందు చేస్తున్నాయి.

# ఉపాధిలో సాగునీటి కాలువల పూడికతీత

## ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు

ఇల్లంతకుంట, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : వలసల నివారణకు ప్రభుత్వ ప్రవేశపెట్టిన ఉపాధిహామీ పథకం కింద మండలంలోని పలు గ్రామాల్లో సాగునీటి కాలువల పూడికతీత పనులు చేపట్టారు. గ్రామాలలోని చెరువులు, కుంటలకు వచ్చే కాలువల్లో పూడిక పేరుకపోవడం, పలు ప్రాంతాల్లో నీరు రాకుండా అడ్డుగా బండరాళ్లు ఉండటంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. దీంతో కాలువలను శుభ్రం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇల్లంతకుంట, వెంకట్రావుపల్లె, రహీంఖాన్‌పేట, గాలిపెల్లి, ముస్కానిపేట, తాళ్లపెల్లి తదితర గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలతో పనులు చేపట్టారు. కూలీలకు ఉపాధి లభించడమే కాకుండా వర్షాలు కురిస్తే గ్రామాల్లోని చెరువులు, కుంటలు నిండుతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసినా అనంతారం ప్రాజెక్టులోకి నీరు రావడం ఆలస్యం అవుతుందని, రైతులు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి తీసుకవచ్చారు. దీనితో మండలపరిషత్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి దీనిపై చర్చించారు. కాలువలు శుభ్రంగా ఉన్నట్లయితే సమస్య తగ్గుతుందని భావించి అన్ని గ్రామాల్లో పూడికతీత పనులు కొనసాగించారు. మండలంలోని ప్రధానమైన చెరువులు నిండినట్లయితే పంటలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని రైతులు పేర్కొంటున్నారు.



ఇల్లంతకుంటలో పూడిక తీసిన కాలువ

## గోడెక్కిన పాము..



గేటుపై నుంచి దిగుతున్న పాము

సిరిసిల్ల టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆహారం కోసం ఓ పాము (జెర్రిపోతు) గోడెక్కింది. పాము వస్తోందని గ్రహించిన తొండ తొట్టిలోని అలోవేరా చెట్టు ఆకుల మధ్య దాగుంది. అయినా పాము తొండను నోట కరిచి తినేసింది. అనంతరం మెల్లగా గోడ మీదుగా గేటుపైకి చేరుకొని కిందికి దిగి ఇంటి ఆవరణ నుంచి బయటకు వెళ్లింది. ఆ సమయంలో ఇంటి యజమానులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో ఈ దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' తన కెమరాతో క్లిక్‌మనిపించింది.

## దక్షిణ ఇండియా క్రైస్తవ సంఘం మాడరేటర్‌గా కరీంనగర్ బిషప్




రూబెన్‌మార్క్

కరీంనగర్ కల్చరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ఐదు రాష్ట్రాలకు కలిపి దక్షిణ ఇండియా క్రైస్తవ సంఘం మాడరేటర్‌గా కరీంనగర్ బిషప్ డాక్టర్ కె.రూబెన్‌మార్క్ ఎన్నికైనట్లు అధ్యక్ష మండలలే సెక్రెటరీ ఎర్ర జాకబ్ తెలిపారు. సోమవారం అధ్యక్ష మండల కార్యాలయ ప్రాంగణంలో వెస్లీ క్యాథడ్రల్ చర్చ్, సెంటినరీ వెస్లి చర్చ్, ఎంఎండీ చర్చ్ సభ్యులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల చెన్నైలో జరిగిన ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో విజయం సాధించారన్నారు. కార్యక్రమంలో కాదాసి ప్రశాంత్, జిబిసంజయ్, సత్యం, సిహెచ్ శామ్యూల్, కట్ట బెనర్, బొబ్బిలి విక్టర్, సూర్య ప్రకాశ్, నికోలస్, సూర్య పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు మేము సైతం

- విత్తనబంతుల తయారీలో ఖైదీలు
- సేవ్ ఎన్విరాన్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా వినూత్న ప్రయత్నం
- ఎర్రమట్టి, జీవామృతం, వర్మికంపోస్టుతో 15 వేల విత్తన బంతుల తయారీ



గుట్టలు, కొండల ప్రాంతాల్లో విత్తన బంతులను విసురుతున్న జైలు అధికారులు, సిబ్బంది

కరీంనగర్ క్రైం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వాతావరణం కాలుష్యం రోజురోజుకు పెరిగిపోతోంది. ఇష్టానుసారంగా చెట్లను నరికివేయటం, భూగర్భాన్ని తొలచి సహజవనరులను వెలికితీసి విచ్చలవిడిగా వినియోగిస్తూ పర్యావరణాన్ని చేజేతులా నాశనం చేసుకుంటున్నాం. పర్యావరన పరిరక్షణకు కరీంనగర్ జైలులోని ఖైదీలు మేము సైతం అంటూ ముందుకు వస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోన్న వన మహోత్స వాన్ని విజయవంతం చేయడానికి కరీంనగర్ జిల్లా జైలులోని ఖైదీలు తమవంతు పాత్ర పోషిస్తున్నారు. విత్తన బంతులు తయారు చేస్తున్నారు. ఖైదీలు తయారు చేసిన విత్తన బంతులతో గుట్టలు, కొండల ప్రాంతాలకు పచ్చదనం తేవాలని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటి వరకు గ్రామాలు, నగరాలు, రహదారుల వెంట మొక్కలు నాటేవారు. వాటికి పశువుల నుంచి రక్షణ లేకపోవడం, నీటిని అందించలేక చాలా మొక్కలు చనిపోయేవి. మరోవైపు గుట్టలు, కొండల ప్రాంతంలో మొక్కల పెంపకం కష్టంతో కూడుకున్నది. ఈసారి ఎలాగైనా ప్రభుత్వ భూములు, గుట్టలు, కొండల ప్రాంతాల్లో మొక్కలు నాటాలని అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. అందులోభాగంగానే ఖైదీల ఆధ్వర్యంలో విత్తనబంతుల తయారీని చేపట్టారు.



విత్తన బంతుల పెట్టెలతో జైలు అధికారులు, సిబ్బంది

### ● చొప్పదండి నుంచి ఎర్రమట్టి...

కరీంనగర్ జైలులో తయారు చేస్తున్న విత్తన బంతుల కోసం చొప్పదండి ప్రాంతం నుంచి నాణ్యమైన ఎర్రమట్టిని జైలు సూపరింటెండెంట్ జి విజయ్‌డేని తెప్పించారు. మొదట కరీంనగర్ ఓపెన్ జైలులో ఉన్న చింత, అల్లనేరడి, వేప, కానుగ విత్తనాలను సేకరించి జైలు ఆవరణలో ఆరబెట్టారు. తరువాత ఎర్రమట్టికి జీవామృతం, వర్మీకంపోస్టును కలిపి సపోటా పండు పరిమాణంలో బంతులుగా తయారు చేసి మధ్యలో విత్తనాన్ని పెట్టారు. గతంలో ప్రత్యేక శిక్షణ పొందిన వారిలో కొందరు ఖైదీలుండగా మరికొందరు కలిసి బంతులను తయారు చేశారు. ఖైదీలు తయారు చేసిన ఈ విత్తన బంతులను ఆరబెట్టిన తర్వాత ఎప్పటిక ప్పుడు జైలులోని గోదాంలో భద్రపరుస్తున్నారు. ఐదేళ్ల క్రితం కరీంనగర్ జైలులో ఖైదీలు 3.5 లక్షల వరకు విత్తన బంతులు తయారు చేశారు.

### విత్తన బంతుల ఉపయోగం ఇలా..

విత్తన బంతుల వల్ల మొక్కను ప్రత్యేకంగా నాటే అవసరం ఉండదు. సీడ్ బాల్స్‌ను గుట్టలు, కొండల ప్రాంతాల్లో చల్లుతారు. వర్షం కురిసినప్పుడు విత్తనబంతి తడిసి అందులోని విత్తనం బయటకు వస్తుంది. అది మొక్కగా నాటుకుంటుంది. వీటికోసం ట్రీగార్డ్స్, నీటి సరఫరా లాంటి ప్రత్యేక చర్యలు అవసరం లేదు. ఖర్చు తక్కువ, లాభం ఎక్కువ ఉండడంతో వీలైనంత ఎక్కువగా విత్తన బంతులను తయారు చేయించాలని జైళ్ల శాఖ భావిస్తున్నది. ఇటీవల జైళ్లశాఖ డీజీ డాక్టర్ సౌమ్యమిశ్రా ఆదేశాలతో కరీంనగర్ జిల్లా జైలు అధికారులుఖైదీలతో జైలు ఆవరణలో లభించిన వేప, చింత, కానుగ, అల్లనేరడి తదితర రకాల విత్తనాలతో విత్తన బంతులు తయారు చేయించారు. కరీంనగర్ జైలులోని 50 మంది ఖైదీలు ప్రతిరోజు విత్తన బంతులు తయారు చేస్తున్నారు. నెల రోజుల్లో 15 వేల సీడ్‌బాల్స్‌ను తయారు చేశారు. ఇందులో మూడు వేల సీడ్ బాల్స్‌ను హుజూరాబాద్ సబ్ జైలుకు పంపించారు. హుజూరాబాద్ ప్రాంతంలోని ప్రభుత్వ భూములు, గుట్టలు, కొండ ప్రాంతాల్లో అక్కడ ఇసబ్ జైలు అధికారులు ఈ విత్తన బంతులను చల్లనున్నారు. కరీంనగర్ జైలు అధికారులు కమాన్‌పూర్, చింతకుంట, రేకుర్తి ప్రాంతాల్లో ఆదివారం విత్తన బంతులను చల్లారు.



ఖైదీలు తయారుచేసిన విత్తన బంతులు

### కొండ, గుట్ట ప్రాంతాల్లో ఉపయోగం..: జీ విజయ్‌డేని, కరీంనగర్ జైలు సూపరింటెండెంట్



వన మహోత్సవంలో భాగంగా జైళ్ల శాఖ డీసీ డాక్టర్ సౌమ్యమిశ్ర ఆదేశాలతో ఖైదీలచేత 15 వేల విత్తన బంతులను తయారు చేశాం. ఈ బంతులను అటవీశాఖ అధికారుల సూచనల మేరకు ప్రభుత్వ భూములు, గుట్టలు, కొండ ప్రాంతాల్లో చల్లుతున్నాం. వీటికి ఎటువంటి రక్షణ లేకుండానే సహజసిద్ధంగా మొలకెత్తుతాయి. కరీంనగర్ జైలులో ఉన్న ఖైదీలు తమ వంతు సేవలు అందించారు. జైలు ఆవరణలోని చెట్ల నుంచి సేకరించిన విత్తనాలు, జీవామృతం, వర్మికంపోస్టును ఉపయోగించి విత్తన బంతులు తయారు చేశాం.

## రాజన్నకు భక్తుల మొక్కులు

### సందడిగా మారిన ఆలయం



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్నకు భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆషాఢ మాసం చివరి సోమవారం కావడంతో భక్తులు ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా కనపడింది. భక్తులు ఉదయాన్ని ధర్మగుండంలో స్నానాలు చేసి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి ప్రవేశించారు. రాజన్నకు ఇష్టమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనంతరం శ్రీరాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్న భక్తులు అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో రాధాబాయి నేతృత్వంలో ఏఈవోలు, సూపరిండెంట్లు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## దాశరథి పురస్కారానికి 'అన్నవరం' ఎంపిక

### నేడు రవీంద్రభారతిలో సీఎం, అతిథుల చేతుల మీదుగా ప్రదానం



కరీంనగర్ కల్చరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కేంద్రా నికి చెందిన కవి, రచయిత అన్నవరం దేవేందర్ 2025 సంవత్సరానికిగాను దాశరథి కృష్ణ మాచార్య రాష్ట్ర ప్రభుత్వ సాహితీ పురస్కారానికి ఎంపికయ్యారు. దాశరథి శత జయంత్యుత్సవాల సందర్భంగా మంగళవారం సాయంత్రం రవీంద్ర భారతిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మీదుగా ఈ పురస్కారాన్ని ఆయన అందుకోనున్నారు. దేవేందర్ ఇప్పటి వరకు 12 కవితా సంపుటాలు వెలువరించారు. ఆయన రచించిన మూడు పుస్తకాలు ఆంగ్ల భాషలోకి అనువాదమయ్యాయి.

# 'స్ఫూర్తి'దాత 'పాకాల'..

- విద్యార్థుల్లో పోటీతత్వానికి క్విజ్ పోటీలు
- ఇన్‌స్పైర్ శిబిరాలకు జాతీయ గైడ్‌గా మన్ననలు
- రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు



జాతీయ ఇన్‌స్పైర్ ప్రదర్శనలో శంకర్‌గౌడ్ (ఫైల్)

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

విద్యార్థులకు రోల్ మోడల్‌గా.. ఇన్‌స్పైర్‌గా ఉపాధ్యాయుడు పాకాల శంకర్‌గౌడ్ నిలుస్తున్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడిగా పాఠాలు బోధించడమే వరకే పరిమితం కాకుండా విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికి తీయడానికి పలు కార్యక్రమాలను చేపడుతున్నారు.

### విద్యార్థుల్లో పోటీతత్వం

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులలో పోటీతత్వాన్ని పెంపొందించడానికి 2014-2016 వరకు కొలనూరు పాఠశాలలో జిల్లావ్యాప్తంగా క్విజ్ పోటీలు నిర్వహించారు. 2020 కరోనా కాలంలో విద్యార్థులకు ఆన్‌లైన్ పాఠాలు బోధించి ఉపాధ్యాయులకు స్ఫూర్తిగా నిలిచారు. ప్రజల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడానికి డాక్టర్ల సహాయంతో కరోనా హెల్ప్ లైన్‌ను ఏర్పాటు చేశారు.సమాజంలో మూఢ నమ్మకాలు తొలగించి సైన్స్‌ని ప్రోత్సహించాలని ఉద్దేశంతో జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీలో, పని చేస్తున్నారు. కుసుమ రామయ్య బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు కథలు, పాటలు, కవితలు రాయడంలో మానేరు రచయితల సంఘం, తెలంగాణ రచయితల వేదికల సౌజన్యంతో కర్యశాలలను నిర్వహించారు.

### ఇన్‌స్పైర్ అవార్డులకు గైడ్‌గా...

ఇన్‌స్పైర్ అవార్డులు సాధించడానికి విద్యార్థులను ముందుండి నడిపించారు. సైన్స్‌లో ప్రయోగాలు చేపిస్తూ సైన్స్‌ఎగ్జిబిషన్లలో, ఇన్‌స్పైర్ అవార్డులలో, అటల్ టింకరింగ్ ల్యాబ్ నిర్వాహణలో ప్రతిభ కనబరిచారు. గైడ్ టీచర్‌గా తయారు చేసిన పవర్‌లుమ్ క్లాత్ ఫోల్డింగ్ మిషన్‌కు 2022-23 సంవత్సరానికి ఇన్‌స్పైర్ మానాక్ జాతీయస్థాయి ప్రదర్శనకు ఎంపికై పలువురు మన్ననలను పొందింది. ఇప్పటికీ మూడుసార్లు ఇన్‌స్పైర్ మానక్, జేఎన్‌ఎంఎస్‌ఎస్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో రాష్ట్ర స్థాయికి గైడ్ టీచర్‌గా, ప్రాజెక్టులకు గైడ్ టీచర్‌గా ఎంపికయ్యారు.

# ప్రభుత్వ ఐటీఐపై విద్యార్థుల ఆసక్తి



- కరీంనగర్‌లో 172 సీట్లతో ఏటీసీ ఏర్పాటు
- అడ్మిషన్స్ ప్రక్రియ ప్రారంభం
- మొదటి విడతలో 54 సీట్ల కేటాయింపు
- ప్రారంభం కానున్న రెండో విడత ప్రవేశాలు

గణేశ్‌నగర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల్లో వృత్తి నైపుణ్య శక్తిని, సృజనాత్మను వెలికి తీసేందుకు ఐటీఐ కళాశాలల్లో ఏటీసీ కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. ఏటీసీ కేంద్రాల ద్వారా విద్యార్థులకు ఏ రంగంలో ఆసక్తి ఉందో గుర్తించి ఆ రంగంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఉపాధి మార్గాలు చూపిస్తుంది. దీంతో విద్యార్థులు ఐటీఐ, ఏటీసీల్లో శిక్షణ తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. పదో తరగతి అనంతరం చాలా కోర్సులు విద్యార్థులు అందుబాటులో ఉన్నాయి. ఇటీవల ఐటీఐ విద్యను పటిష్ఠం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేసింది. 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఐటీఐ కళాశాలల్లో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ను (ఏటీసీ) ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ప్రారంభం కాగా.. తొలి విడత సీట్ల కేటాయింపు పూర్తయింది. రెండో విడతలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు కోరు తున్నారు. రెండో విడత ప్రవేశాల ప్రక్రి య ఆగస్టు 31 వరకు జరగనుంది. మిగిలిన సీట్లు స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేస్తారు.



### కరీంనగర్ ఐటీఐలో 412 సీట్లు

కరీంనగర్ లోని ఉజ్వల పార్క్ సమీపంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ) కళాశాలలో మొత్తం 412 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో 240 సీట్లు ఐటీఐవి కాగా.. 172 సీట్లు ఏటీసీ కోర్సులవి. తొలి విడతలో ఐటీఐలో 54 సీట్లు కేటా యించారు. రెండో విడత సీట్ల కేటాయింపు ప్రారంభం కానున్న సందర్భంగా విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఐటీఐ కళాశాల కమిటీ వైస్ చైర్మన్ డాక్టర్ వై గంగాధర్ తెలిపారు. ఐటీఐ కోర్సులు విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు ఉపాధి రంగంలో మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. రామగుండం ఎన్టీపీసీ జీఎం బినోయ్ జోస్ చైర్మన్‌గా టీ-గేట్ (తెలంగాణ గేట్‌వే ఫర్ అడాప్టివేట్ ట్రైనింగ్ అండ్ ఎంప్లాయి మెంట్) కరీంనగర్ కమిటీని ఏర్పాటు చేశారన్నారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో ఏటీసీ కోర్సులు నిర్వహిస్తామని తెలిపారు.

### విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**డాక్టర్ వై గంగాధర్, ఐటీఐ కళాశాల కమిటీ వైస్ చైర్మన్**



ఐటీఐ శిక్షణ పొందిన విద్యార్థులకు మంచి ఉద్యోగావకా శాలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఐటీఐ కళాశాలలతోపాటు ఏటీసీ కేంద్రాలు ఏర్పాటుచేసి శిక్షణను అందిస్తోంది. దీంతోపాటు ఉపాధి మార్గాలు చూపెడుతోంది. ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలి. ఐటీఐల్లో చేరే విద్యార్థుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఐటీఐ చేసిన వారు సొంతగా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే వీలుంటుంది.

### ఐటీఐతో ఉద్యోగావకాశాలు

**కె. అశోక్‌కుమార్, కరీంనగర్**

**ఐటీఐ ప్రిన్సిపాల్, కళాశాల కమిటీ కన్వీనర్**



ప్రభుత్వ ఐటీఐ, ఏటీసీ కేంద్రంలో అడ్మిషన్ తీసుకున్న విద్యార్థులు వాళ్ల భవిష్యత్తుకు మంచి మార్గాన్ని ఎంచుకున్నవారవుతారు. ఐటీఐ చేసిన వారికి చిన్న స్థాయి పరిశ్రమల నుంచి మొదలుకొని పెద్ద కంపెనీల వరకు ఉద్యోగ అవకాశాలు ఎన్నో ఉన్నాయి. సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ స్కీం కింద ఎన్నో పనులు చేసుకోవచ్చు. ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి.

# రాజన్న ఆలయంలో శ్రావణమాసం వేడుకలు

- ఈనెల 25 నుంచి వచ్చే నెల 23 వరకు ప్రత్యేక పూజలు
- 8న వరలక్ష్మీవ్రతం, 16న గోకులాష్టమి వేడుకలు



వేములవాడ కల్చరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాసం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈవో రాధాబాయి ప్రకటనను సోమవారం విడుదల చేశారు. ఈనెల 25వ తేదీ శుక్రవారం నుంచి వచ్చేనెల 23వ తేదీ శనివారం వరకు శ్రావణ మాసం సందర్భంగా భక్తుల రద్దీ ఉంటుందని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం త్వరిత గతిన దర్శనాలు కల్పించేందుకు ఆది, సోమవారాలు, ఇతర ముఖ్య పర్వదినాలలో నిత్యం రాజన్న ఆలయంలో నిర్వహించే పూజల కార్యక్రమాల సమయములను తాత్కాలికంగా నిర్ణయించినట్లు ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళ వాయిద్యములు తెల్లవారు జామున 3 గంటల నుంచి 3.15 వరకు, సుప్రభాత సేవా ఉదయం 3.15 నుంచి 3.45 వరకు, సర్వదర్శనము ఉదయం 3.45 నుండి 4.50 వరకు, ఆలయ శుద్ధి ఉదయం 4.50 నుంచి 5.10 వరకు, ప్రాతఃకాల పూజ ఉదయం 5.10 గంటల నుంచి 6.30 గంటల వరకు నిర్వహిం చనున్నట్లు పేర్కొన్నారు.

### శ్రావణ మాసం ప్రత్యేక పూజల వివరాలు...

వేములవాడ రాజన్న ఆలయంలో శ్రావణ మాసం పురస్కరించుకుని మొదటి, రెండో, మూడో, ఐదో శుక్రవారాల్లో శ్రీరాజరాజేశ్వరి దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. నాలుగవ శుక్రవారం శ్రీరాజరాజేశ్వరీ దేవి అమ్మవారికి ఉదయం, సాయంత్రం విశేష పూజలు, ఉదయం శ్రీమహాలక్ష్మీ అమ్మవారికి అభిషేకము, అర్చన, ఉదయం 8 గంటలకు నుంచి హోమం నిర్వహించనున్నారు. శ్రావణమాసం మొదటి, రెండో, మూడో, నాలుగో సోమవారాల్లో స్వామి వారికి ఉదయం 5.30 గంటల నుంచి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం 6.05 గంటల నుంచి కల్యాణ మంటపంలో మహాలింగార్చన నిర్వహించనున్నారు. 9వ తేదీ శనివారం రాఖీ పౌర్ణమి రోజున శ్రావణ శుద్ధ పూర్ణిమ సందర్భంగా ఉదయం 7.45 గంటల నుంచి స్వామివారికి ఉపాకర్మను చేపట్టనున్నారు. అలాగే రాజన్న ఆలయంలో 16వ తేదీ శనివారం గోకులాష్టమి(శ్రీకృష్ణజన్మాష్టమి) ఘనంగా నిర్వహించనున్నారు. రాత్రి 8 గంటలకు స్వామివారి కల్యాణ మండపంలో ఉట్లుకొట్టుట, డోలోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

## మానవ తప్పిదాలతోనే ప్రమాదాలు

### ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బి రాజు

భగత్‌నగర్, జూలై 21(ఆంధ్రజ్యోతి): మానవ తప్పిదాలతోనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆర్టీసీ కరీంనగర్ రీజినల్ మేనేజర్ బి.రాజు అన్నారు. సోమవారం అంబేద్కర్ బస్ స్టేషన్ ఆవరణలోని సమావేశ మందిరంలో డ్రైవర్లకు మూడు రోజుల శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ అంటేనే ప్రయాణికులకు నమ్మకమని, ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుడా డ్రైవర్లు సురక్షితమైన డ్రైవింగ్ చేయాలని సూచించారు. ఆర్టీసీ జోనల్ ఆసుపత్రి సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి.గిరిసింహారావు మాట్లాడుతూ సంస్థలో డ్రైవర్లు ఆరోగ్యంగా ఉంటేనే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. సమావేశంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ పి. మల్లేశం, సేఫ్టీవార్డెన్స్ కొమురయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో గేదెలు మృతి

కొడిమ్యాల, జూలై 21(ఆంధ్రజ్యోతి) : కొడిమ్యాల మండలం చెప్యాల గ్రామానికి చెందిన గోగూరి శ్రీనివాస్‌రెడ్డి గేదె గ్రామ శివారులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో సోమవారం సాయంత్రం విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు గ్రామ మాజీ సర్పంచ్ పూటుకూరి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. గేదె విలువ సుమారు 40వేల రూపాయల వరకు ఉంటుందని తెలిపారు. మృతి చెందిన గేదెకు నష్టపరిహారం అందించాలని బాధితుడు ప్రభుత్వాన్ని కోరారు.

●కోరుట్ల రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల మండలం కల్లూర్ గ్రామంలో సోమవారం విద్యుదాఘాతంతో అందే శ్రీహరికి చెందిన గేదే మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. పశువుల కాపరి గ్రామం నుంచి అయిలాపూర్ రోడ్డుకు వెళ్లే రహదారి వెంబడి మేపడానికి తీసుకు వెళ్తుండగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర షాక్ తగిలి గేదె అక్కడిక్కడే మృతి చెందినట్లు తెలిపారు. గేదే విలువ రూ.70 వేల వరకు ఉంటుందని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని గ్రామ మాజీ సర్పంచ్ వనతడుపుల అంజయ్య కోరారు.

## గ్రామ దేవతలకు అలంకరణ వస్త్రాలు అందజేత

కొడిమ్యాల, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : కొడిమ్యాల మండల కేంద్రంలోని, మండలంలోని నాచుపల్లి గ్రామంలో పెద్దమ్మ, పోచమ్మ, ఎల్లమ్మ దేవాలయాల్లోని దేవతలకు అలంకరణ వస్త్రాలను సోమవారం ఆలయాల పూజారులకు కొండగట్టు గిరి ప్రదక్షణ భక్తులు అందించారు. చిలుకూరి బాలాజీ దేవాలయం శివాలయం ప్రధాన అర్చకుడు, కొండగట్టు గిరి ప్రదక్షణ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేష్ ఆత్మారాం మహారాజ్, భక్తుల సహకారంతో వస్త్రాలను, ఓడి బియ్యం, పూజా సామగ్రి, ఇతర వస్తువులను సమకూర్చినట్లు పలువురు భక్తులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కొండగట్టు గిరి ప్రదక్షణ సభ్యులు ఏనుగు ఆదిరెడ్డి, శ్రీనివాస్, గణేష్, రాజమౌళి, శ్రీనివాస్ అశోక్, శ్యాం, ఆలయాల అర్చకులు, కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

# సామాజిక న్యాయం కోసం మల్లికార్జున ఖర్గే కృషి

### -మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ -జిల్లాలో ఘనంగా ఏఐసీసీ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు



ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మంత్రి అడ్లూరి

గొల్లపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం కోసం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నిరంతరం కృషి చేస్తున్నారని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం గొల్లపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించగా మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి చేతుల మీదుగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసుకున్నారు.

కాంగ్రెస్ నాయకులు మంత్రి లక్ష్మణ్ కుమార్‌కు స్వీట్లు తినిపించి శాలువాతో ఘనంగా సన్మానించారు. మల్లికార్జున ఖర్గే పుట్టిన రోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఆయన దేశానికి, నిమ్న, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్, వైస్ చైర్మన్ పురపాటి రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి, తాజామాజీ ప్రజా ప్రతినిధులు గంగాధర్, సత్యానారాయణ గౌడ్, హరికిరణ్ రెడ్డి, నాయకులు రాపల్లె గంగన్న, పురంశెట్టి వెంకటేశం, గురిజల బుచ్చిరెడ్డి, నేరెళ్ల మహేష్, ఆకుల సుమన్ గౌడ్, మార్కెట్ డైరెక్టర్లు చాడ సత్తయ్య, కట్ట లక్ష్మణ్ రావు, వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

●జగిత్యాల: అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లిఖార్జున్ ఖర్గే పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. జగిత్యాల పట్టణంలోని ఇందిరా భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి కేక్ కట్‌చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల నియోజక వర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలుపాల్గొన్నారు.

●మెట్‌పల్లిటౌన్: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు ఆదేశాల మేరకు సోమవారం అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున కార్గే జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు జెట్టి లింగం, తిప్పిరెడ్డి అంజిరెడ్డి, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు నాయిని సురేష్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు రాజయ్య, రాజగోపాల్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో బంజారాలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించాలి



నియామక పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం, జూలై21(ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బంజారాలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు బుక్య గోవింద నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ ధర్మారం వేంకటేశ్వర స్వామి ఫంక్షన్‌హాల్‌లో సోమవారం కార్యవర్గ సమావేశం ఏరాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బంజారాలను పది శాతం రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బంజారా జాతి ప్రజలు ఆర్థికంగా, సామాజికంగా వెనుక పడ్డారని వారిని చైతన్యం చేయాలని కోరారు. అనంతరం ఇబ్రహీంపట్నం మండలం కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడిగా మాలోత్ రమేష్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా భూక్యా నందేవ్ నాయక్ లను ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బానోత్ రమేష్ నాయక్, తిమ్మాపూర్ మాజీ సర్పంచ్ విజయ్ నాయక్, జిల్లా నాయకులు భానోత్ రవినాయక్, జరుపూల శోభన్ నాయక్, మాలోత్ ప్రశాంత్ నాయక్, భూక్యా సురేష్ నాయక్, మహేష్ నాయక్ పాల్గొన్నారు.

## 'కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తే ఊరుకోం'

మల్లాపూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తే ఊరుకునేది లేదని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కొమ్ముల చిన్నారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పాతధాంరాజ్ పల్లి గ్రామంలోని సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఏర్పడిన సంవత్సరంలోపు ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ పాత బకాయిలు రూ.170 కోట్లు చెల్లించి చిత్తశుద్ధిని నిరూపించుకుందన్నారు. 2019లో ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం ధర్మపురి అరవింద్ పాదయాత్ర చేయడం జరిగిందన్నారు. పాత బకాయిలు కట్టకుండా, బ్యాంకు గ్యారంటీ ఇవ్వకుండా ఏ పరిశ్రమ కూడా ప్రారంభం కాదని అరవింద్‌కు తెలుసని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై వేస్తున్న నిరాధారమైన ఆరోపణలు, నిందలను ఖండిస్తున్నమన్నారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు మామిడాల శ్రీనివాస్, కొమ్ముల చిన్న చిన్నారెడ్డి, కలకోట శంకర్, కొత్తూరి చిన్నరాజారెడ్డి, పొలాస వివేక్‌లు, తదితరులు పాల్గొన్నారు.

## దాశరథి శత జయంతి వేడుకలు

కొడిమ్యాల, జూలై 21(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని విజ్‌డమ్ ఉన్నత పాఠశాలలో సోమవారం దాశరథి కృష్ణమాచార్య శత జయంతి వేడుకలను కడమేడ కళాసాహితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో పలువురు కవులు తమ కవితలను చదివి వినిపించారు. అనంతరం కడమేడ కళా సాహితి అధ్యక్షుడు రాజయ్యను పలువురు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కడమేడ కళాసాహితి అధ్యక్షుడు మల్లారపు రాజయ్య, పలువురు కవులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దీకొండ అశోక్, గ్రామ ప్రముఖులు, తదితరులు ఉన్నారు.

## ఖరారు కాని నీటి విడుదల షెడ్యూల్

(ఐదో పేజీ తరువాయి)

అధికారులు నీటి విడుదల చేయనున్నట్లు సంబంధిత వర్గాలు అంటున్నాయి. కాగా జగిత్యాల జిల్లాలో అన్నదాతలు అధిక శాతం ఎస్సారెస్పీ నీటిపైనే ఆధారపడి సాగు చేస్తుంటారు. సుమారు 1.63 లక్షల ఎకరాల ఎస్సారెస్పీ ఆయకట్టు ఉంటోంది. ప్రతీ యేటా ఎస్సారెస్పీ జలాలు విడుదల సందిగ్ధంగా ఉండడంతో రైతులకు సాగునీటి కష్టాలు తప్పేలా లేవు.

### ●అక్టోబరు వరకు వరద నీరు

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ప్రతీ యేటా అక్టోబరు మాసాంతం వరకు వరద నీరు వచ్చి చేరే అవకాశం ఉంటుందన్న అంచనాలున్నాయి. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాన గల మహారాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను ప్రతీ యేటా న్యాయస్థానం ఆదేశాల ప్రకారం జూలై 1వ తేదీ నుంచి అక్టోబరు 28వ తేదీ వరకు తెరిచి ఉంచుతారు. ఎగువ ప్రాంతాన వర్షాలు సమృద్ధిగా కురిస్తే ప్రాజెక్టులోకి వరద నీరు భారీగా వచ్చి చేరుతుంది. సాధారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిండుకుండలా మారడానికి సెప్టెంబరు నెలలో ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరద నీరు వచ్చే అవకాశాలున్నట్లు అధికారులు అంచనా వేస్తుంటారు.

## అభివృద్ధి పనుల్లో నిబంధనలు పాటించేలా చూడాలి



కలెక్టర్ సత్యప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

జగిత్యాల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నిబంధనలను పాటించకుండా జగిత్యాల మున్సిపల్‌లో చేపడుతున్న పనులపై తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సత్య ప్రసాద్‌కు సోమవారం మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి వినతిపత్రం అందించారు. జగిత్యాల మున్సిపాలిటీ పరిధిలో రూ.15 కోట్లకు పైగా టీయూఎఫ్‌ఐడీసీ- 3 నిధులచే చేపట్టబడే నిర్మాణ పనులలో నిబంధనలను ఖాతరు చేయడం లేదన్నారు. ఎలాంటి అగ్రిమెంట్, వర్క్ ఆర్డర్ లేకుండానే ఓ కాంట్రాక్టరు పనులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ప్రధానంగా పట్టణంలోని 6,8,13,21,22,31,32,39,40 వార్డుల్లో పనులు కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపి సదరు టెండర్‌ను రద్దు చేయాలని వినతిపత్రం అందించారు.

## 'నిబంధనలకు విరుద్ధంగా సీసీ రోడ్ల నిర్మాణం'

జగిత్యాల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మున్సిపాలిటీ పరిధిలోని 10 వార్డులలో 15.6 కోట్లతో జరుగుతున్న పనులకు ఎలాంటి టెండర్ అగ్రిమెంట్ లేకుండా పనులు చేస్తున్నారంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు మాజీ మంత్రి జీవన్‌రెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగిల్ ప్యాకేజిగా రూపొందించి పనులు చేపట్టడంతో స్థానిక కాంట్రాక్టర్‌లకు అవకాశం లేకుండా పోయిందని అన్నారు. కార్యక్రమంలో టిపిసిసి కార్యదర్శి బండ శంకర్, కండ్లపెల్లి దుర్గయ్య, రాజేందర్ పాల్గొన్నారు.

## ఘనంగా బోనాల పండుగ



వెల్లుల్లలో బోనాలతో గౌతమ్ విద్యానికేతన్ విద్యార్థులు

మెట్‌పల్లి రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెల్లుల్ల గ్రామంలోని వెల్లుల్ల గ్రామంలోని గౌతమ్ విద్యానికేతన్‌లో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినిలు బోనాలను నెత్తిన ఎత్తుకొని గ్రామంలోని పలు వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. విద్యార్థులు పోతురాజుల వేషంలో చేసిన నృత్యాలు పలువురిని అలరించాయి. అనంతరం అమ్మవారికి చేరుకుని సమర్పించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ తొగిటి అంజయ్య, ప్రధానోపాధ్యాయురాలు తొగిటి లక్ష్మి పాల్గొన్నారు.

# కరుగుతున్న గుట్టలు

### ●పెగడపల్లిలో చోద్యం చూస్తున్న అధికారులు



పెగడపల్లిలో అక్రమంగా తవ్విన గుట్ట

పెగడపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండల కేంద్రంలో గుట్టలు కరుగుతున్నాయి. మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్ పక్కన 583 సర్వే నంబరులో అడ్డ గుట్ట 100 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. గుట్ట బోరును రోడ్డు కాంట్రాక్టర్లు వేలాది ట్రిప్పుల మట్టిని ఒక్క రూపాయి ప్రభుత్వానికి చలానా కట్టకుండానే ట్రాక్టర్లు, టిప్పర్ల సాయంతో తరలిస్తు న్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొంతమంది ఎక్స్‌కావేటర్ ఓనర్లు సైతం ప్రతి సంవత్సరం అక్రమంగా మట్టిని తరలిస్తూ లక్షల రూపాయలు దండుకోవడమే కాకుండా గుట్టను కనుమరుగు చేస్తున్నారు. మట్టి తీసిన ప్రదేశంలో ఆక్రమణదారులు ఆ స్థలాన్ని కబ్జా చేస్తూ సాగు చేసుకుంటున్నారు. లక్షలాది రూపాయల విలువైన భూములు ఆక్రమణలకు గురవుతున్నా పట్టించుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమంగా మట్టి తరలి పోకుండా చర్యలు తీసుకోవడంతో పాటు గుట్టలు ఆక్రమణకు గురి కాకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

### చర్యలు తీసుకుంటున్నాం -తహసీల్దార్ రవిందర్



మండల కేంద్రంలోని 583 సర్వే నంబరులోని అడ్డగుట్ట ఆక్రమణకు గురి కాకుండా చర్యలు తీసుకుంటున్నాం. గతంలో మట్టి తవ్వకాలు జరిగాయి. కొన్ని నెలలుగా మట్టి తీయకుండా నిఘా పెట్టాం. గుట్టను ఆక్రమించుకుంటూ సాగు చేస్తున్న వారికి నోటీసులు జారీ చేసి సాగు చేయకుండా అడ్డుకున్నాం. మట్టి తవ్వకాలు జరిపితే చట్ట ప్రకారం చర్యలు తప్పవు.

## వరద కాలువ వంతెనలపై పట్టింపేది..?

### -గుంతలతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



మల్యాల మండలంలో వరదకాలువపై నిలిచిన వర్షపు నీరు

మల్యాల, జూలై 21(ఆంధ్రజ్యోతి): వరద కాలువ వంతెనలపై అధికారుల పట్టింపు కరువైంది. దీంతో బ్రిడ్జిలు శిథిలం అయి ప్రమాదకరంగా మారుతున్నాయి. వర్షాలకు బ్రిడ్జిలపై నీరు నిలిచి గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఇనుపచువ్వలు లేచి వాటి మనుగడకు ప్రశ్నార్థకంగా మారుతోంది. మండలంలోని రాంపూర్, నూకపల్లి, మల్యాల, ముత్యంపేట తదితర గ్రామాల్లోని వంతెనలు వర్షపు నీరుతో కాలువలను తలపిస్తున్నాయి. గుంతలతో వంతెనలకు ప్రమాదం పొంచి ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా వంతెనలను అధికారులు పర్యవేక్షించి ప్రమాదకరంగా మారకముందే తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## మున్నూరుకాపు సంఘం కార్యవర్గానికి సన్మానం

ధర్మపురి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇటీవల ఎన్నికైన మున్నూరుకాపు సంఘం కార్యవర్గాన్ని సోమవారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సన్మానించారు. ధర్మపురి పట్టణ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు చీపిరిశెట్టి రాజేష్, ప్రధాన కార్యదర్శి బండి మహేష్, కార్యవర్గ సభ్యులు మంత్రి లక్ష్మణ్‌కుమార్‌ను సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మంత్రి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ నూతన కార్యవర్గం మున్నూరుకాపు సంఘం అభివృద్ధి కోసం పాటు పడాలని అన్నారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం ఉపాధ్యక్షులు ముత్తినేని లక్ష్మణ్, కోశాధికారి మహేష్, కార్యదర్శి పానుగంటి రవి, సంయుక్త కార్యదర్శి సంగి రాజన్న పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి మంత్రి అడ్లూరి పరామర్శ

వెల్గటూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండల కేంద్రానికి చెందిన గాజుల శ్రీనివాస్ బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందగా సోమవారం ఆయన కుటుంబాన్ని సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పరామర్శించారు. శ్రీనివాస్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. కుటుంబానికి భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని, ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట నాయకులు మెరుగు మురళి గౌడ్, బందెల ఉదయ్, గుండాటి సందీప్‌రెడ్డి ఉన్నారు.

## ఎలగందుల ఖిల్లాను సందర్శించిన విద్యార్థులు

పెగడపల్లి, జులై 21 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండలంలోని సుద్దపల్లి విద్యార్థులు సోమవారం ఎలగందుల ఖిల్లాను సందర్శించారు. ప్రవేశ, ప్రథమ పూర్తి చేసుకున్న ద్వితీయ సోపాన్‌లో అడుగు పెడుతున్న 40 మంది విద్యార్థులు ఎలగందుల ఖిలా, దోమినార్ తదితర కార్యక్రమాలు హైక్ అండ్ ట్రెక్కింగ్‌లో భాగంగా నిర్వహించారు. గైడ్‌కెప్టెన్ బీ.ఎస్.జీ జగిత్యాల జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ పద్మజ ఆధ్వర్యంలో వెళ్లినట్లు తెలిపారు.

# 'యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి'




మాట్లాడుతున్న సీఐ నీలం రవి

మల్యాల, జూలై 21(ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సీఐ నీలం రవి అన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలన అవగాహన కార్యక్రమంలో భాగంగా మల్యాల పోలీస్ సర్కిల్ ఆధ్వర్యంలో ఫ్రెండ్లీ వాలీబాల్ మ్యాచ్ నిర్వహించారు. ఇందులో మల్యాల, కొడిమ్యాల, పెగడపల్లి మండలాల నుంచి వచ్చిన వాలీబాల్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ నీలం రవి మాట్లాడుతూ డ్రగ్స్‌తో జీవితాలు దుర్భరం అవుతాయని పేర్కొన్నారు. ఎస్సైలు నరేశ్‌కుమార్, సందీప్ నాయకులు ఆదిరెడ్డి, ముత్యం శంకర్, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, జనగాం శ్రీనివాస్, మ్యాక లక్ష్మన్, అజయ్, బండి రవి, నాగులపేట సంజీవ్, పోలీసులు పాల్గొన్నారు.

●వెల్గటూర్: యువత ఉన్నత లక్ష్యంతో ప్రణాళిక బద్ధంగా కష్టపడి ముందుకు సాగాలని ఎస్సై ఉమాసాగర్ పేర్కొన్నారు. ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు వెల్గటూర్ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా ఆరు జట్లు పాల్గొన్న వాటీబాల్ పోటీలను ఎస్సై ప్రారంభించారు. హోరా హోరీగా సాగిన పోటీలలో విజేతగా నిలిచిన వెల్గటూర్ జట్టుకు ట్రోఫీ అందజేశారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ యువతీ, యువకులు క్రీడల పట్ల మక్కువ పెంచుకొని రాణించాలని అన్నారు. క్రీడలతో శారీరక ధారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని తెలపడానికి ఈ టోర్నీ నిర్వహించినట్లు పేర్కొన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నట్లు దృష్టికి వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ టోర్నీలో గెలుపొందిన జట్లు నియోజకవర్గ స్థాయి పోటీలలో పాల్గొంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోచ్ కాంపెల్లి సతీష్, సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు నక్క సురేష్, మూగల సంతోష్, రాజశేఖర్, మ్యాకల వికాస్, ఆకుల సుమన్, కానిస్టేబుల్ నూనె కుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

●సారంగాపూర్: డ్రగ్స్, సైబర్ నేరాలపై యువత అవగాహన కలిగి ఉండాలని ఎస్సై .వీ.గీత అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని గ్రామాల యువతకు సోమవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో వాలిబాల్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ పోటీల్లో ఆరు జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యంగా యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. గెలుపొందిన జట్లకు బహుమతులను ప్రదానం చేశారు.

●బీర్‌పూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మండలస్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనలపై అవగాహన కార్యక్రమంలో భాగంగా బీర్‌పూర్ మండలకేంద్రంలో ఎస్సై సబ్బాని రాజు ఆధ్వర్యంలో మండలస్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించారు. మండలంలో నుండి ఆయా గ్రామాలకు చెందిన యువకులు అధిక సంఖ్యలో పాల్గొనగా వారీలోనుండి 8 టీం లను సెలెక్ట్ చేసి పోటీలను నిర్వహించారు. మొదటి విజేతగా బీర్‌పూర్‌కు చెందిన టీం ఎంపిక కాగా రెండవ విజేతగా తుంగూర్ గ్రామానికి చెందిన టీం విజేతలుగా గెలుపొందారు. విజేతలకు మెడల్, జ్ఞాపికలు అందజేశామని ఎస్సై రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు లక్ష్మన్, మహేందర్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

## మెట్‌పల్లి క్లబ్ ఎదుట ఆందోళన

మెట్‌పల్లిటౌన్, జూలై21(ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి క్లబ్ అక్రమ రిజిస్ట్రేషన్‌ను వెంటనే రద్దు చేయాలని సోమవారం పట్టణంలోని రామ్‌నగర్ మెట్‌పల్లి క్లబ్ ముందు బాధితులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెట్‌పల్లి క్లబ్‌ను అక్రమంగా ఎవరికీ తెలియకుండా అమ్మేసిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని మృతిచెందిన క్లబ్ వారసులు కోరారు. తక్షణమే ఉన్నతాధికారులు, ప్రభుత్వం స్పందించి తమరికి న్యాయం చేయాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో కాశిరెడ్డి బాస్కర్‌రెడ్డి, సురేష్ గౌడ్, భరత్ పాల్గొన్నారు.

## కార్యవర్గం ఎన్నిక

వెల్గటూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండల రుద్ర ఎలక్ట్రిషన్, ప్లంబింగ్ యూనియన్‌ను ఆదివారం ఏర్పాటు చేశారు. కిషన్‌రావుపేట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం వద్ద అధ్యక్షుడిగా వెల్గటూర్‌కు చెందిన బండమీది గోపిని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా దాసరి హరీష్ (మొక్కట్రావుపేట), ప్రధాన కార్యదర్శిగా పోరండ్ల శ్రీనివాస్ (కోటిలింగాల), సంయుక్త కార్యదర్శిగా పందిగిరి సత్తయ్య (పాషిగామ)ను ఎన్నుకున్నారు.

## ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

కోరుట్ల రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్లాపూర్ గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో కోరుట్ల బ్రాహ్మణ ఆర్థిక సంఘ ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కార కార్యక్రమం నిర్వహించారు. పట్టణ బ్రాహ్మణ ఆర్థిక సంఘం ఆధ్వర్యంలో ఆషాఢమాసం పురస్కరించుకొని వన భోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేంకటేశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన వేద పండితులు ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందించి నగదు పురస్కారం ప్రకటించారు. ఇంటర్, పది పరీక్షల ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన పాలెపు కార్తికేయ, సహస్రసులక్షణ, సౌఖ్య, సుశాంత్, శీవర్షిణీ, శ్రీనిధి, హసీని, శ్రీనులతో పాటు వారి తల్లిదండ్రులను సన్మానించి ప్రశంస పత్రాలతో పాటు నగదును అందించారు. అదేవిధంగా ఇటీవల పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు శ్రీనివాస్ మూర్తి-శ్రీదేవిలను సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు పాలేపు రామకృష్ణ శర్మ, సభ్యులు శంకర్ శర్మ, సేనాపతి ప్రవీణ్ ఆచార్య, నితిన్ కుమార్, స్వరాజు, కిషన్ శర్మ, రమేష్ శర్మ, అరుణ్ శర్మ, పనీంద్ర శర్మలతో బ్రాహ్మణ సమితి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## గజ్జెల కాంతంకు సన్మానం

భీమారం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన గజ్జెల కాంతంను తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం ఉమ్మడి మేడిపల్లి మండల అధ్యక్షుడు బంగారు దీపక్ సోమవారం కలిసి శాలువా, బొకేతో ఘనంగా సన్మానించారు. రానున్న రోజుల్లో గజ్జెల కాంతం చట్ట సభల్లో అడుగుపెట్టి యావత్ దళిత బహుజన జాతులకు అండగా నిలవాలని ఆకాంక్షించారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ

ధర్మపురి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలో వివిధ కారణాలతో మృతి చెందిన వ్యక్తుల కుటుంబ సభ్యులను మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సోమవారం పరామర్శించారు. దమ్మన్నపేట గ్రామానికి చెందిన దూడ శైలజ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆమె భర్త సతీష్ తీవ్రంగా గాయపడి చికిత్స పొంది ఇంటి రాగా ఆయనను పరామర్శించారు. దొనూర్ గ్రామానికి చెందిన గొల్లన రవి మృతి చెందగా వారి కుటుంబ సభ్యులకు రూ 5 వేలు చొప్పున ఆర్థికసాయం అందించారు.

## 'గడి బురుజు ప్రాంతంలో నిర్మాణాలకు జువ్వాడి కృషి'

కోరుట్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గడి బురుజు ప్రాంతంలో నూతన నిర్మాణాలు చేపట్టడానికి జువ్వాడి నర్సింగరావు కృషి చేశాడని కాంగ్రెస్ నాయకులు అన్నారు. సోమవారం పట్టణంలోని గడి బురుజు ప్రాంతంలో కాంగ్రెస్ నాయకులు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గడి బురుజు ప్రాంతంలో నూతన నిర్మాణం కొరకు ఆ ప్రాంత ప్రజలు కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జు జువ్వాడి నర్సింగరావు దృష్టికి తీసుకుపోగా అనుమతులు మంజూరి చేయించాడని అన్నారు. నిర్మాణాలకు అనుమతి ఇచ్చిన ప్రభుత్వంతో పాటు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జు జువ్వాడి నర్సింగరావు, జువ్వాడి కృష్ణారావులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నేతలు తిరుమల గంగాధర్, స్వోగబీ, ఏఆర్ అక్బర్, ఖయ్యూం, వసీం పాల్గొన్నారు.